సాక్షి
జగిత్యాల
గురువారం । 5 । డిసెంబర్ । 2024



మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, విప్‌లు ఆది, అడ్లూరి, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, సత్యనారాయణ

సీఎం టూర్ సాగిందిలా..

సాయంత్రం 4.20: కలెక్టరేట్ ఆవరణలో సీఎం హెలికాప్టర్ ల్యాండ్
4.23: కలెక్టరేట్ నుంచి సభాస్థలికి సీఎం, మంత్రులు, అధికారుల రాక
4.29 నుంచి 4.59: సభలో ఏర్పాటుచేసిన స్టాల్స్ సందర్శన
4.55: జ్యోతి ప్రజ్వాలన, రాష్ట్ర గీతం ఆలాపాన
6.21: ఉద్యోగులకు నియామక పత్రాల అందజేత, ఎంవోయూలు, సీఎం కప్, బ్రోచర్స్ అవిష్కరణ
6.42: వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు
6.45 నుంచి 7.33: సీఎం రేవంత్‌రెడ్డి స్పీచ్ అనంతరం తిరిగి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం

సభ సైడ్‌లైట్స్

- సీఎం రేవంత్‌రెడ్డి సభకు వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతున్న పెద్దపల్లి పట్టణానికి చెందిన తిరుపతిని కారు ఢీ కొట్టింది. అప్రమత్తమైన పోలీసులు ప్రాథమిక చికిత్స చేసి, అంబులెన్స్‌లో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
- సభకు వచ్చిన కార్యకర్తలు, ప్రజలను పోలీసులు తనిఖీ చేశారు. పెన్నులు, అంబర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- సీఎం మాట్లాడుతున్న సమయంలో సభ సమీపంలో పలువురు ఆర్టీసీ బస్సుల పైన నిల్చొని ప్రసంగాన్ని విన్నారు
- సీఎం సభకు లక్ష మందికి పైగా ప్రజలు వచ్చినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు చెబుతున్నారు.





సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

'యువ వికాసం'.. జన ప్రవాహం

- సోనియాగాంధీ హామీ మేరకు తెలంగాణ ఏర్పాటైంది..
- ఉమ్మడి కరీంనగర్‌కు రూ.1,024 కోట్లు మంజూరు చేశాం
- పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేస్తాం
- రామగుండానికి విమానాశ్రయం, మంథనికి కోకాకోలా ఫ్యాక్టరీ తెప్పిస్తాం
- తుమ్మిడిహెట్టి దగ్గర బ్యారేజీ నిర్మిస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి
- పెద్దపల్లి యువ వికాసం విజయోత్సవ సభ సక్సెస్

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి కరీంనగర్ గడ్డ నుంచే సోనియా గాంధీ 2004లో తెలంగాణ పోరాటాన్ని, అమరవీరుల ప్రాణత్యాగాలను గుర్తిస్తున్నామని ప్రకటించి, తెలంగాణ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది.. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంతోపాటు ఉమ్మడి జిల్లాకు నిధులిచ్చే బాధ్యత నాదేనని.. సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన విజయోత్సవల్లో భాగంగా బుధవారం పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో రూ.1,024 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశామని, శాతవాహన విశ్వవిద్యాలయానికి లా కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. పెద్దపల్లిలో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేస్తామని, రామగుండానికి విమానాశ్రయం, మంథనికి కోకాకోలా ఫ్యాక్టరీ తెప్పిస్తామన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర బ్యారేజీ నిర్మించి, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు సాగు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

స్టాల్స్ పరిశీలన..

సభా ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసిన ఆపరేషన్ గరుడ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, డీఈఈటీ, ఏఎల్ఈఏపీ, టాస్క్, ఎన్ఎస్ఐసీ, న్యాక్, టామ్ కామ్, యువజన క్రీడా శాఖ, సింగరేణి ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పరిశీలించారు.

నియామక పత్రాలు.. ప్రారంభోత్సవాలు

17 మంది అభ్యర్థులకు సీఎం, మంత్రులు నియామక పత్రాలు అందజేశారు. 8 పరిశ్రమలతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఎంవోయూ. డీఈఈటీ లాంచ్. సీఎం కప్–2024 బ్రోచర్, రియల్ టైం లైవ్ వీడియోల యూట్యూబ్ చానల్, జెర్సీ, కప్ ఆవిష్కరణ. రూ.1,024.90 కోట్లతో రోడ్ల నిర్మాణ, పెద్దపల్లి మున్సిపాలిటీ భవనం, పెద్దపల్లి ఆస్పత్రి 100 పడకల అప్‌గ్రెడేషన్, రామగుండం నర్సింగ్ కళాశాల, గుంజపడుగులో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మంథనిలో నూతనంగా 50 పడకల ఆస్పత్రి, పెద్దపల్లిలో సబ్‌స్టేషన్, పెద్దపల్లి, రామగుండంలలో యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు, పెద్దపల్లిలో బాలికల జూనియర్ కళాశాల, శ్రీరాంపూర్ కేజీబీవీ అభివృద్ధి, గోదావరిఖని పీజీ కళాశాల అకాడమిక్ బ్లాక్ పనులు, రామగిరి ఖిల్లా, మంథని టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధి, పెద్దపల్లి ట్రాఫిక్, మహిళా, రూరల్, ఎలిగేడు పోలీస్ స్టేషన్లు, పెద్దపల్లి బస్ డిపో పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

నేతలు ఏమన్నారంటే...

- ఆర్అండ్‌బీ శాఖ ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు రూ.710 కోట్లు మంజూరు చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కులగణనతో దేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తుందని అన్నారు.
- రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు సూచించారు.
- గత ప్రభుత్వం మాటల ప్రభుత్వం, తమది చేతల ప్రభుత్వమని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.
- గతంలో రైతు రుణాలను సోనియాగాంధీ పూర్తిస్థాయిలో మాఫీ చేశారని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల వరకు మాఫీ చేశారని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు.
- రామగుండానికి ఎయిర్‌పోర్టు, పరిశ్రమలు తీసుకువచ్చి, యువతకు ఉపాధి కల్పిస్తామని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు.
- ధర్మపురి ఆలయ అభివృద్ధికి రూ.50 కోట్లు, గోదావరి నదీ ప్రక్షాళనకు రూ.17 కోట్లు మంజూరు చేయాలని విప్ లక్ష్మణ్‌కుమార్ కోరారు.
- రామగుండంలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సీఎం, మంత్రులను కోరారు.



సీఎంకు ఓదెల మల్లన్న చిత్రపటం బహూకరణ



స్టాల్ వద్ద యువతులతో సీఎం కరచాలనం



డిజిటల్ ఎంప్లాయిమెంట్ యాప్ ప్రారంభిస్తూ..



వివిధ కంపెనీల ప్రతినిధులతో ఎంవోయూ..

పని చేయడానికి వచ్చాం



సింగరేణి కార్మికులకు గతంలో ఎన్నడూ లేని విధంగా కోటి రూపాయల ప్రమాద బీమా అందించాం. గత ప్రభుత్వం మాదిరిగా మేము ప్రచారం చేసుకోవడానికి కాదు పని చేయడానికి అధికారంలోకి వచ్చాం. జైపూర్‌లో విద్యుత్ ప్లాంట్ స్టేజ్–2 పనులకు టెండర్ పిలిచాం. రామగుండంలో కొత్త పవర్ ప్లాంట్‌కు త్వరలో భూమిపూజ చేస్తాం.

– మల్లు భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎం

'పత్తిపాక'కు డీపీఆర్



పాలకుర్తి ఎత్తిపోతల పథకం, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం లేకుండానే 66.7 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చింది. రైతులు తెలంగాణ సోనా, బీపీటీ రకాలు సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

– ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి

రింగ్‌రోడ్డు నిర్మిస్తాం



మంథని పట్టణంలోని శ్రీపాద్ మార్గ్ నుంచి మంథని పట్టణానికి రూ.162 కోట్లతో 4 లేన్ రింగ్ రోడ్డు నిర్మిస్తాం. గతంలో ఎన్నడూ లేని విధంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా ఇచ్చాం. సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు సంబంధించి ఇళ్ల స్కీం, పన్నుల విషయంలో న్యాయం చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.

– శ్రీధర్‌బాబు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

ధర్మపురి, కొండగట్టు అభివృద్ధికి చర్యలు



ధర్మపురి, కొండగట్టు ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. గతంతో పోలిస్తే మెరుగ్గా ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత మా అందరిపై ఉంది.

– పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి

'ఇందిరమ్మ' యాప్ ప్రారంభిస్తున్నాం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులందరం గురువారం ఇందిరమ్మ ఇళ్ల యాప్ ప్రారంభిస్తున్నాం. శుక్రవారం నుంచి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. ధరణి రికార్డుల నిర్వహణను ఎన్ఐసీకి అప్పగించాం.

– పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి

సంతోషంగా ఉంది



పెద్దపల్లికి రూ.461 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. జిల్లా కేంద్రంలో బస్ డిపో ఏర్పాటవుతుండటం సంతోషంగా ఉంది.

– చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి



సభకు వెళ్తున్న వారిని తనిఖీ చేస్తున్న సిబ్బంది



సభాస్థలికి వస్తున్న ప్రజలు



కళాకారుల ఆటాపాట



పోలీసుల బందోబస్తు



ఒగ్గుడోలు కళాకారుల విన్యాసం



బస్సుల పైనుంచి చూస్తున్న యువకులు



బోనాలతో మహిళల కోలాట ప్రదర్శన



నృత్యం చేస్తున్న గుస్సాడీ కళాకారులు

న్యూస్‌రీల్

కొండగట్టులో ప్రజాపాలన విజయోత్సవం



కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో ప్రజాపాలన, ప్రజావిజయోత్సవాల సందర్భంగా బుధవారం పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, మాన్యసూక్త హోమం, పంచసూక్త హోమం నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన తిరుమల బృందం భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. వేద పాఠశాల విద్యార్థులు హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర పారాయణం భజన చేశారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని 'ఆశ'ల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు

జగిత్యాలటౌన్: రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్‌పోలియో నిర్వహణ పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ ఇందూరి సులోచన డిమాండ్ చేశారు. బిల్లులు మంజూరు చేయాలంటూ బుధవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఆశా కార్యకర్తల ఆందోళనకు ఆమె మద్దతు తెలిపారు. ఆశా కార్యకర్తల సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. పాత బకాయిలు చెల్లించకుండా మళ్లీ సర్వే చేయాలని అనడం సమంజసం కాదన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మమత, సుజాత, లావణ్య, పద్మ, స్వప్న, యశోద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని ఫిర్యాదు



ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: రూ.రెండులక్షలు, ఆపై రుణాలు తీసుకున్న పలువురికి రుణమాఫీ కాలేదని మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామస్తులు ఆర్డీవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఆయనను కార్యాలయంలో బుధవారం కలిశారు. గ్రామంలోని సుమారు 40 శాతం మందికిపైగా మాఫీ కాలేదని, రేషన్‌కార్డు లేనివారిని పరిగణనలోకి తీసుకోలేదని వివరించారు. రుణమాఫీ అందరికీ చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. కార్యక్రమంలో మురళీధర్‌రెడ్డి, చిన్న గంగారెడ్డి, రాజేశ్, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



అంబారిపేట అడవుల్లో అంతర్గాం జిల్లా పరిషత్ విద్యార్థులు

జగిత్యాలక్రైం: వన్యప్రాణుల, అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీశాఖ అధికారి రవి ప్రసాద్ అన్నారు. బుధవారం వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట అర్బన్ ఫారెస్ట్‌లో జిల్లా అటవీశాఖ సిబ్బంది ఏర్పాటు చేసిన వన్యప్రాణి సంరక్షణ అవగాహన కార్యక్రమాల్లో అంతర్గాం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అడవులు, వన్యప్రాణులు అంతరించినట్లయితే మానవ, జీవాల మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. అడవుల నరికివేతతో కాలుష్యం పెరగడంతోపాటు జీవవైవిధ్యం, ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుందన్నారు. ప్రతిఒక్కరూ ఉద్యమంలా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. జగిత్యాల అటవీశాఖ రేంజర్ పద్మారావు, డీఆర్వో శ్రీనివాస్, ఎఫ్ఎస్‌వోలు శ్రీనివాస్, సాంబయ్య, బీట్ ఆఫీసర్లు శ్రీనివాస్, రవీందర్‌నాయక్, ఉపాధ్యాయులు భూపతిరావు, రజినికర్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, సరోజన, అనిత పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి
- కలెక్టర్ సత్యప్రసాద్



సిలబస్‌పై ఆరా తీస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

పెగడపల్లి: ఇంటర్, పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలకేంద్రంలోని ఆదర్శ మోడల్ స్కూల్‌ను ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులను పరిశీలించి వసతులు, బోధన, సిలబస్‌పై ఆరా తీశారు. ప్రణాళికతో చదివి మంచి మార్కులు సాధించాలని ఇంటర్ విద్యార్థులకు సూచించారు. పది విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన వారిపై శ్రద్ధ చూపాలన్నారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని అయితిపల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం సేకరణలో జరుగుతున్న ఆలస్యంపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని రికార్డులు పరిశీలించారు. ధరణి పెండింగ్ దరఖాస్తులపై అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్, ఏపీఎం సమత పాల్గొన్నారు.

జిల్లాలో కంపించిన భూమి

ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ప్రజలు

జగిత్యాలక్రైం/రాయికల్/పెగడపల్లి: జగిత్యాలరూరల్, అర్బన్ మండలాల్లో బుధవారం ఉదయం సుమారు ఆరు సెకన్లపాటు భూమి కంపించడంతో ప్రజలంతా ఆందోళనకు గురయ్యారు. ఇంట్లో ఉన్న వస్తువులు కదలడంతో బయటకు పరుగులు తీశారు. రాయికల్ పట్టణంలో మూడుసెకన్ల పాటు భూమి కంపించింది. ఉదయం 7.30గంటల ప్రాంతంలో కంపించినట్లు ప్రజలు తెలిపారు. పెగడపల్లిలో ఉదయం 7.28 గంటల ప్రాంతంలో భూమిలో కదలికలు వచ్చాయి. జనం ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఇళ్లలో వస్తువులు కదిలినట్లు పలువు రు మహిళలు పేర్కొన్నారు.

ఒక్కసారిగా భయపడ్డాం



పట్టణంలో బుధవారం ఒక్కసారిగా 3 నుంచి 5 సెకన్ల పాటు కంపించింది. ఇంట్లో అందరం భయపడ్డాం. బయటకు పరుగులు తీశాం. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో ఏం జరిగిందో తెలియక అయోమయానికి గురయ్యాం.

– నిమిషకవి మారుతి, రాయికల్

ధర్మపురిలో ఘనంగా సుదర్శన హోమం



సుదర్శన హోమంలో అర్చకులు, ప్రభుత్వ విప్

ధర్మపురి: ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సుదర్శన హోమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరై హోమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి


రాములు మృతదేహం

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలంలోని తాట్ల వాయికి చెందిన దడి కొమ్ముల రాములు(55) అనే ఉపాధిహామీ కూలీ గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాములు బుధవారం తాట్లవాయి గ్రామంలోని నర్సరీలో పని చేస్తున్నాడు. ఉన్నట్టుండి ఛాతిలో నొప్పి రావడంతో అక్కడే కుప్పకూలాడు. తోటి కూలీలు 108కు సమాచారం అందించారు. కానీ, సిబ్బంది వచ్చేలోపే అతను చనిపోయాడు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక నాయకులు కోరారు.

గోదావరిలో భక్తుల రద్దీ


పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

ధర్మపురి: షష్టి వారాల సందర్భంగా బుధవారం ధర్మపురి గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. మల్లన్న పట్నాలు వేసుకునే ముందు భక్తులు మల్లన్న విగ్రహాలను గోదావరిలో శుద్ధి చేయడం ఆనవాయితీ.

తప్పుడు పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్.. మహిళ అరెస్ట్

వేములవాడ: రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న తంగళ్లపల్లి మండలం నేరెల్లకు చెందిన గోశిక మంజులను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వివరాలు.. వేములవాడ అర్బన్ మండలం తెట్టెకుంట గ్రామానికి చెందిన సయ్యద్ హైదర్ మారుపాకకు చెందిన కొత్తి శివయ్య వద్ద 1980లో తెట్టెకుంట శివారులో 14 గుంటల భూమి కొనుగోలు చేశాడు. హైదర్ పేరిట క్రితం మరణించగా, అప్పటి నుంచి సదరు భూమి కబ్జాలో ఆతడి కుటుంబ సభ్యులే ఉన్నారు. కాగా, అప్పట్లో ఆతడి కుటుంబ సభ్యులే తమ పేరిట భూమిని రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించుకోలేదు. ఇటీవల రెవెన్యూ రికార్డులలో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు వెళ్లగా, సదరు భూమి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పద్మ పేరిట రిజిస్ట్రేషన్ అయింది. దీంతో హైదర్ కుమారుడు సయ్యద్ బాషా వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం పద్మను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రారంభం


మాట్లాడుతున్న వీసీ ఉమేశ్‌కుమార్

కరీంనగర్‌సిటీ: శాతవాహన విశ్వవిద్యాలయంలోని లైబ్రరీ ఆడిటోరియంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను వీసీ ఉమేశ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయ విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి కోసం ఈ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైదన్న డీప్ యూనివర్సిటీ వీసీ జి.దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్య ఆవశ్యకతను తెలుసుకుని భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలన్నారు. రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ జాఫర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డి.హరికాంత్ పాల్గొన్నారు.

కుంటుపడుతున్న పల్లె పాలన

- పని ఒత్తిడిలో ప్రత్యేకాధికారులు
- పది నెలలుగా అరకొర నిధులు
- పనుల్లో అలసత్వం



ఈ ఫొటోలో మురుగు కాల్వ ఇబ్బందులు వెళ్ల బోసుకుంటున్న ఈ కుటుంబం పోతుగల్ గ్రామానికి చెందినవారు. వంగపల్లి ముత్తయ్య, మల్లవ్వ, కవిత, శ్రీనివాస్ ల ఇంటి ఎదుట ఏడాదిగా మురుగు కాల్వ సమస్య ఉంది. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఐంకుడుగుంత నిర్మించగా, పది ఇళ్లకు చెందిన మురుగు నీరు చేరడంతో అది సరిపోవడం లేదు. దీంతో ఇలా ముత్తయ్య ఇంటి ఎదుట మురికికూపంగా మారింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదని సదరు కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యదర్శికి, ప్రత్యేకాధికారులకు విన్నవించినా మురుగు కాలువ నిర్మించడం లేదని పేర్కొన్నారు. అయితే ఇక్కడ ఎంపీడీవో ప్రత్యేకాధికారిగా ఉన్నారు. పోతుగల్, గన్నేవారిపల్లె ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో కొనసాగుతున్నారు. దీంతో సదరు అధికారి ఎప్పుడు బిజీగా ఉండడంతో గ్రామాలపై దృష్టి పెట్టడం లేదు. ఇలా ఒక్క పోతుగల్ గ్రామంలోనే జిల్లా అంతటా అభివృద్ధికోసం ఇతర పనులలో ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



పోతుగల్ గ్రామ పంచాయతీ

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో ప్రత్యేకాధికారుల పాలనకు పదినెలలైంది. కాగా, పంచాయతీల్లో సకాలంలో పౌర సేవలు అందడం లేదనే ఆరోపణలు వున్నాయి. మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్ లు పాలకవర్గాల పదవీ కాలం జనవరి 31తో ముగిసిన సంగతి విదితమే. స్థానిక సంస్థలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఒకవైపు శాఖాపరమైన విధులతోపాటు పంచాయతీలు, మండల ప్రత్యేకాధికారులుగా అధికారులు పనిచేస్తున్నారు. దీంతో పల్లెల్లో పాలన పడకేస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

'ప్రత్యేకం'తో ఇబ్బందులు

ప్రత్యేకాధికారులకు పాలన బాధ్యతలు అప్పగించడంతో పని ఒత్తిడికి గురవుతున్నారు. గ్రామసభలు, తీర్మానాలు, వేతనాల చెల్లింపులతోపాటు అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీలకు వచ్చేందుకు ప్రత్యేకాధికారులు ముఖం చాటేశారని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామసభలు, వేతనాల చెల్లింపులతోపాటు అభివృద్ధి పనుల బిల్లుల విషయంలో ప్రత్యేకాధికారులు సంతకాలు చేయడం లేదు. కొన్ని పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించే సమయం, తీరిక లేకపోవడంతో బిల్లుల చెల్లింపులకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. కొన్ని గ్రామాల్లో పనులు పారదర్శకంగా జరుగుతుండగా.. అంతటా అవే పరిస్థితులు లేవని ప్రత్యేకాధికారులు భావిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో స్ట్రిక్ట్‌గా సమీక్షలు చేస్తుండడంతో చెల్లింపులు సంతకాలు చేయడం లేదు. పనులు ఎంబీ రికార్డు అయి ఉండి, నిధులు సిద్ధంగా ఉంటే చెల్లింపులు చేయాలని జిల్లా అధికారులు ఆదేశిస్తున్నారు. దీనిపై అధికారులు అదితాంచి వ్యవహరిస్తున్నారు.

నిధుల కేటాయింపుపై ప్రభావం

స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులకు కోత పడుతుంది. ముఖ్యంగా ప్రజాశక్తి సంఘం నిధుల తోపాటు ఉపాధిహామీ పనులపై ప్రభావం చూపుతోంది. జిల్లా స్థాయిలోనూ సమస్యలు ఉన్నాయి. జిల్లా పరిషత్‌కు ఇన్‌చార్జిగా కలెక్టర్, డీఆర్‌డీవో శేషాద్రి డీపీవో, డీఆర్‌డీఏగా అదనపు విధులు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు జిల్లా స్థాయి అధికారులు 13 మండలాలకు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర మండల స్థాయి అధికారులు పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా కొనసాగుతున్నారు.

పనులు జరగడం లేదు



మా ఇంటి ముందు నుంచి మురుగు కాల్వ నిర్మించాలని పంచాయతీలో తీర్మానం చేశారు. మోరీ పనులు కొంత మంది అడ్డుకున్నారు. దీంతో పంచాయతీ సిబ్బంది పనులు నిలిపివేశారు. ప్రత్యేకాధికారి దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదు. ఆయన ఎప్పుడు వస్తారో, వెళ్తారో తెలియదు.

– వంగపల్లి ముత్తయ్య, పోతుగల్

సమస్యల పరిష్కారానికి కృషి



మండలాలు, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత వరకు కృషి చేస్తున్నాం. ఎక్కడైన నిధుల లేకపోతేనే బిల్లులు ఆగుతున్నాయి. ప్రత్యేకాధికారులు వీలున్న సమయంలో గ్రామాలను సందర్శిస్తున్నారు. వారిపై కూడా పని ఒత్తిడి ఉంది. సర్వే, ధాన్యం సేకరణ వంటి విషయాల్లో బిజీగా ఉన్నారు.

– శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి

6 అబద్ధాలు.. 66 మోసాలు

- గ్యారంటీల గారడీతో ప్రజలకు కాంగ్రెస్ కుచ్చుటోపీ
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి


మాట్లాడుతున్న భోగ శ్రావణి

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన ఆరు అబద్ధాలు.. 66 మోసాలుగా సాగిందని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి అన్నారు. జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మార్పు పేరిట కాంగ్రెస్ చెప్పిన అందమైన అబద్ధాలను నమ్మి ఓట్లేసి రైతులు, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు గోసపడుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్య అయిన యావరోడ్, డబుల్ ఇళ్ల నిర్మాణం ఇప్పటికీ ముందుకు సాగడం లేదన్నారు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని చెప్పుకునే నాయకుడు.. జగిత్యాల అభివృద్ధి పేరిట దొంగదారిలో కాంగ్రెస్‌లో చేరిన మరో నాయకుడు జగిత్యాలకు చేసింది శూన్యమన్నారు. యువ వికాసం కింద విద్యార్థులకు ఇస్తామన్న రూ.5లక్షల విద్యా భరోసా కార్డు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఏమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక్క కొత్త పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనలో ప్రజలు మరింత అప్పుల కుప్పగా మారిందన్నారు. నాయకులు రంగు గోపాల్, నలువాల తిరుపతి, జిల్లా రాజు, మ్యాదరి అశోక్, సిరికొండ రాజన్న, దూరిశెట్టి మమత, చెన్నాడి మధురిమ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్‌క్రైం డీఎస్పీ వేడీ.రంగారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంతోపాటు, అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సైబర్ జాగృత దివస్ కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం సైబర్ మోసాలు, ఏపీకే ఫైల్స్ ఉపయోగించి నకిలీ కస్టమర్ కేర్ మోసాలు, సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా మోసాలు చేస్తున్నారని తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సోషల్ మీడియాను పిల్లలు ఎక్కువగా వాడుతున్నారని, తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలకు వేళాయె

జగిత్యాల: వైజ్ఞానిక ప్రదర్శనలకు జిల్లా ముస్తాబవుతోంది. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాస్థాయి (ప్రేరణ, వైజ్ఞానిక ప్రదర్శన (ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్)తో పాటు, బాలవైజ్ఞానిక ప్రదర్శన పోటీలు జరుగనున్నాయి.

రెండు రకాల్లో పోటీలు

రెండు రకాల్లో జిల్లాస్థాయి ప్రదర్శనలు జరుగుతున్నాయి. 6 నుంచి 10వ తరగతి చదివే బాలబాలికలు పోటీపడనున్నారు. ప్రతిభ ఆధారంగా మొత్తం ప్రదర్శనలో 10 శాతం నమూనాలను రాష్ట్రస్థాయికి పంపనున్నారు. రాష్ట్రస్థాయిలో సత్తా చాటితే జాతీయస్థాయిలో రాష్ట్రపతి భవనానికి కూడా వెళ్లవచ్చు.

బాలవైజ్ఞానిక ప్రదర్శనలో ప్రధాన అంశం

సుస్థిర అభివృద్ధిలో సాంకేతిక పాత్ర, ఏడు ఉప అంశాలు ఉంటాయి. ప్రతి ఉప అంశంలో సీనియర్, జూనియర్ విభాగాల్లో ఒక ప్రాజెక్ట్ చొప్పున మొత్తం 14 నమూనాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. జాతీయస్థాయి ప్రదర్శనలకు ఎంపికైన విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత సాంకేతిక శాస్త్ర సంస్థల్లో నిర్వహించే కోర్సుల అభ్యసించేందుకు రిజర్వేషన్లు సైతం వర్తిస్తాయి. ఇది భావిశాస్త్రవేత్తగా ఎదిగేందుకు ఉపయోగపడుతుంది.

ప్రతిఒక్కరూ పాల్గొనాలి



ఇన్‌స్పైర్‌లో ప్రతిఒక్క విద్యార్థి పాల్గొనాలి. ఒక బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ఒక పాఠశాల నుంచి ఒక గైడ్ మాత్రమే రావాలి. సెలక్ట్ అయిన ఇన్‌స్పైర్ అవార్డ్స్ విద్యార్థులు తప్పకుండా ఎగ్జిబిట్స్‌తో హాజరుకావాలి. – రాము, డీఈవో

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్

ఈనెల 6, 7 తేదీల్లో జగిత్యాలలోని ఓల్డ్ హైస్కూల్‌లో ఇన్‌స్పైర్ జరుగుతుంది. విద్యార్థులు వారి ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను వైట్ చార్ట్‌పై రాసి రోజు 6న రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో ఇవ్వాల్సి ఉంటుంది. ఇంకో సెట్ విద్యార్థి వద్దే ఉంచుకోవాలి. ఆనంతరం జ్యూరీ మెంబర్లకు చూపించాల్సి ఉంటుంది.

వారబందీ పద్ధతిలో సాగునీరు

- జనవరి 1 నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల: ఈఎన్సీ శంకర్

తిమ్మాపూర్: రబీలో యాసంగి పంటలకు వారబందీ పద్ధతిలో సాగునీరు అందిస్తామని ఎస్సారెస్పీ ఈఎన్సీ శంకర్ తెలిపారు. ఎల్ఎండీలోని సీఈ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు.. ప్రస్తుతం ఎల్ఎండీలో 23.735 టీఎంసీలు, శ్రీరాజరాజేశ్వర(ఎంఎంఆర్)లో 26.73 టీఎంసీల నీరు ఉందన్నారు. మిషన్ భగీరథ, తాగునీటి అవసరాలు పోగా రెండు ప్రాజెక్టుల నుంచి 25 టీఎంసీలు, ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి 5 టీఎంసీలు మొత్తం 30 టీఎంసీల నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా జనవరి 1నుంచి సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఈ ప్రక్రియ మార్చి 31వరకు 90రోజులు కొనసాగుతుందని వెల్లడించారు. స్టేజీ1 మహబూబాబాద్ వరకు 8 రోజులు, అక్కడి నుంచి సూర్యాపేట వరకు 7 రోజులు నీటిని వదలనున్నట్లు తెలిపారు. కాలువ కింద మొత్తం పంటలకు 60 టీఎంసీలు కావాల్సి ఉండగా.. ఆన్ ఆఫ్ పద్ధతిలో 30 టీఎంసీలతోనే సరిపెట్టనున్నట్లు వివరించారు.

మహిళా హోంగార్డ్ రిమాండ్

వేములవాడ: వేములవాడ ఆలయంలో ఏఈగా పనిచేసి రిటైర్డ్ అయిన డి.శేఖర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన మహిళా హోంగార్డు వద్ద అనూషను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వివరాలు.. కొద్ది రోజుల క్రితం సదరు హోంగార్డు తన భర్త ఆరోగ్యం బాగాలేదని శేఖర్ వద్ద రూ.3.50 లక్షలు అప్పు తీసుకుంది. ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని ఇచ్చేదేదు. డబ్బులు అడిగితే.. తనను శేఖర్ పెళ్లి చేసుకున్నాడని తప్పుడు పెళ్లి పత్రిక, మార్ఫింగ్ చేసిన ఫొటోలతో అసత్య ప్రచారం చేస్తూ రూ.5 లక్షలు డిమాండ్ చేయగా, వారు పోతుందని భయపడిన శేఖర్ రూ.5 లక్షలు అనూషకు ఇచ్చాడు. మళ్లీ రూ.2 లక్షలు ఇవ్వాలని బెదిరించడంతో విసిగిపోయిన శేఖర్ వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపి అనూషపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా ఇలాగే బ్లాక్‌మెయిల్ చేస్తే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

నలుగురికి రిమాండ్

సిరిసిల్ల క్రైం: పట్టణంలోని ఓ మద్యం దుకాణం వద్ద ఉన్న వ్యక్తిని బెదిరించి డబ్బులు లాక్కున్న నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీచౌక్ ఎస్‌ఆర్‌కే వైన్స్ వద్ద కొల్లమద్ది భానుప్రసాద్ మద్యం కొనేందుకు వెళ్లగా సంజీవయ్య నగర్‌కు చెందిన అలువాల ప్రకాశ్, రాకేమ్ భరత్, కొండ శేఖర్, తుడిపెద్ది నిఖిల్ ఆతనిపై దాడిచేసి రూ.8 వేలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 2న ఫిర్యాదు కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా వారిని గుర్తించారు. వారినుంచి రూ.2వేలతోపాటు 4 సెల్‌ఫోన్లను సీజ్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్

- విద్యా కమిషన్ సభ్యులు విశ్వేశ్వర్‌రావు
- తరగతి, వంట గదులు, డార్మిటరీల పరిశీలన


విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్వేశ్వర్ రావు

మల్యాల: నేటి విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్తు అని, వారిని తీర్చిదిద్దేందుకు పాఠశాలల్లో ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు, ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాలను జిల్లా కో–ఆర్డినేటర్ మహేశ్‌కుమార్‌తో కలిసి బుధవారం సందర్శించారు. కళాశాల హాస్టల్ రికార్డులు, మూత్రశాలలు, వంటగది, డైనింగ్ హాల్, స్టోర్ రూం, డార్మిటరీలను పరిశీలించారు. వంటల్లో కాలంచెల్లిన నూనెలు ఉపయోగించవద్దని సూచించారు. మూత్రశాలలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని, ఆశ్రద్ధ చేయకూడదని సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థి దశ నుండే అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు పడుకుంటున్నామని విద్యార్థినులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మానస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంజనశ్రీకి రాష్ట్రస్థాయి అవార్డు



అంజనశ్రీని అభినందిస్తున్న మంత్రి సీతక్క, చైర్మన్ వీరయ్య

రాయికల్(జగిత్యాల): రాయికల్ పట్టణానికి చెందిన బొమ్మకంటి అంజనశ్రీకి జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డు వరించింది. నాగరాజు–గౌతమి దంపతుల కూతురు అంజనశ్రీ (జూనియర్ సుధాచంద్రన్) కూచిపూడి నృత్యంలో రాణిస్తోంది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య చేతుల మీదుగా అవార్డు అందుకుంది. అనంతరం అంజనశ్రీ చేసిన కూచిపూడి నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమాధికారి నరేశ్, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, డ్యాన్స్ మాస్టర్ మచ్చ దేవదాస్ అభినందించారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- నగదు, వెండి ఆభరణాలు స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి(కోరుట్ల): తాళం వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం పోలీసులు ముత్యంపేట శివారులో వాహనాల తనిఖీలు చేస్తున్న సమయంలో ముత్యంపేటకు చెందిన గంధ్ర మహిపాల్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వారిని మరింత విచారణ చేయగా గత నెల 16న మల్లాపూర్ మండల కేంద్రంలో, ఈ నెల 1న రిట్టపూర్ గ్రామంలోని రెండు ఇళ్లలో చోరీ చేసినట్లు, గత నెల 28న ముత్యంపేటలో హార్వెస్టర్ పనిముట్లు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.10 వేల నగదు, రూ.5 వేల విలువ గల వెండి ఆభరణాలు, రూ.30 వేల విలువ చేసే హార్వెస్టర్ పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. మల్లాపూర్ ఎస్సై కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


మల్లారెడ్డి(ఫైల్)


కాలిపోయిన మల్లారెడ్డి మృతదేహం, బైక్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఈనెల 1న ఆత్మహత్య చేసుకోగా, బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గోదావరిఖని ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణకాలనీలో నివాసముండే కొరకంద్ల మల్లారెడ్డి(50) సెంటినరీకాలనీలోని ఓ రెస్టారెంట్‌లో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఈనెల 1న ఇంట్లో భార్య రజితతో గొడవ జరుగగా, కోపంతో మల్లారెడ్డి ఇంట్లోని బీదీ వెళ్లిపోయాడు. ద్విచక్ర వాహనంపై సెంటినరీకాలనీలోని తాను పని చేసే రెస్టారెంట్‌కు వెళ్లాడు. రాత్రి 10 గంటలకు విధులు ముగించుకొని రెస్టారెంట్ కౌంటర్ వద్ద తన ఫోన్, ఉంగరం పెట్టి బయలుదేరాడు. మార్గమధ్యలో పెట్రోల్ బంకులో క్యాన్‌లో పెట్రోల్ తీసుకొని రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్, గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మీపురం డంపుయార్డ్‌లో నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి తన ద్విచక్రవాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించి తాను నిప్పంటించుకొని మృతిచెంది ఉంటాడని మృతుడి కుమార్తె కొరకంద్ల సాహితిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రామగిరి ఎస్సై చంద్రకుమార్ పేర్కొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.34 కోట్లు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడ: వేములవాడ రాజన్నకు ఆరు రోజుల్లో హుండీల ద్వారా రూ.1,34,45,031 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. స్వామివారి ఓపెన్‌స్లాబ్‌లో బుధవారం కట్టుదిట్టమైన భద్రత నడుమ సీసీ కెమెరాల నిఘా మధ్య ఆలయ అధికారులు, సిబ్బంది, లలితా సేవా సమితి సభ్యులు హుండీ ఆదాయం లెక్కించారు. 173 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి, విదేశీ కరెన్సీ సమకూరినట్లు ఈవో పేర్కొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన నాస్ సర్వే

జగిత్యాల: దేశవ్యాప్తంగా నిర్వహించిన నాస్ సర్వే ప్రశాంతంగా ముగిసిందని డీఈవో రాము తెలిపారు. జిల్లాలో జరిగిన రాష్ట్రీయ సర్వేక్షణ్ పరాఖ్ ఆధ్వర్యంలో జిల్లాలో సెలక్ట్ చేయబడిన 89 పాఠశాలలో 3, 6, 9 తరగతులకు సంబంధించిన విద్యార్థులకు సర్వే నిర్వహించారని, ఇందులో 2,033 మంది విద్యార్థులు 302 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ మురళీమోహన్‌చారి, జిల్లా సెక్టోరల్ అధికారి కొక్కుల రాజేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఎములాడ రాజన్నకు మొక్కులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: ఎములాడ రాజన్నను బుధవారం సుమారు 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో పూజలు చేశారు. ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి పర్యవేక్షించారు.

మహంకాళి మహారుద్ర యాగం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ రాజన్న ఆలయంలో బుధవారం స్వామివారికి మహారుద్ర యాగం, చండీహోమం, కోటి పూజ, రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈవో వినోద్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవస్థానంలో రూ.123 కోట్లతో పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ.50లక్షలతో ఆలయ పునఃనిర్మాణం, రూ.25 లక్షలతో నాంపల్లి గుట్ట సమీపంలోని దేవస్థానం భూమికి ప్రహరీ నిర్మాణం, రూ.71 లక్షలతో ఉప్పుగూర్ గోశాలలో సీసీరోడ్లు, మురికి కాలువ, మరుగుదొడ్ల పనులు చేస్తున్నట్లు చెప్పారు. రూ.35 లక్షలతో గోశాలలో షెడ్లు, విద్యుత్ సౌకర్యం, కోడెల కోసం క్వారంటైన్ షెడ్లు, రూ.50 లక్షలతో జాతర గ్రౌండ్‌లోని గోశాలలో రెండు షెడ్లు, రూ.76 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ, రూ.35 కోట్లతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కేంద్రం, భక్తులకు బ్రేక్ దర్శనాలు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.


కోడెలకు పూజలు చేస్తున్న అర్చకులు